నమస్కారం స్వామి.

"దేవునికి నాయనా నమస్కారం నాక్కాదు."

"ఇదుగోండి స్వామి."

"ఏమిటి నాయనా తెచ్చావ్?"

"ఏవోలెండి. పళ్ళు-పూలు, కానుకలు."

"ఇదుగో అమ్మా పూలు-బాబు ఇవిగో పళ్ళు-శిష్యా! ఆ దక్షిణ తీసుకో."

"చిత్తం స్వామి."

"స్వామి! అజ్ఞానులమైన మాకేదైనా సెలవివ్వండి"

"నాయనా! ఈ కనిపడే సకల చరాచరము లన్నీ మాయ పరబ్రహ్మ ఒక్కటే సత్యం."

"అంటే తమరికి నేను పళ్ళు ఇచ్చింది మాయనా స్వామి?"

"అవును నాయనా."

"పూలిచ్చింది మాయేనా?"

"అవును"

"116 రూపాయలిచ్చింది మాయేనా?"

"ఆహా!"

"అయితే పళ్ళు పూలు భక్తులకిచ్చి డబ్బుమాత్రం తమరే వుంచుకున్నారు. డబ్బుకూడా మాయ అయినపుడు దాన్ని ఇతర్లకివ్వలేదేం స్వామి? అహా నాకు తెలీక అడుగుతాను. డబ్బు మాయకాదా?"

....

ఇక అందరూ పదండి స్వామివారు ధ్యాన సమాధిలోకి వెళ్ళిపోయారు. ★

"లక్ష్మీలక్ష్మీ" అంటూ బిగ్గరగా కేకవేశాడు రంగారావు.

"అబ్బబ్బ ఏమిటండీ ఆ కేకలు" అంటూ వంటింట్లోనుంచి గబగబా గదిలోనికి వచ్చింది లక్ష్మి. "టేబిల్‌మీద పెట్టిన పర్సులో అయిదు రూపాయలు తక్కువైనాయి నువ్వు తీశావా?" కోపంగా అడిగాడు.

"నేనెందుకు తీస్తాను. నాకేం అవసరం ఉంది తీయటానికి" మూతి తిప్పుతూ అన్నది లక్ష్మి "మరింకెవరు తీశారూ?"

"నీ ఉండండి రంగి వాడున్న చిమ్మటానికి గదిలోకి వచ్చింది. అప్పుడు గదిలో ఎవ్వరూ లేరు. మీరు స్నానం చేస్తున్నారు. నేను వంటపనిలో ఉన్నాను. దాని పనే అయ్యుంటుంది. పిలుస్తానుండండి" అంటూ "రంగీ, ఒసే రంగీ" అంటూ కేకలు వేసింది. అంట్లు తోముతున్న రంగి హడావిడిగా పరిగెత్తుకొచ్చింది. "ఏంటమ్మగోరు" అంటూ.

"నిజం చెప్పవే అయ్యగారి పర్సులోంచి ఐదు రూపాయలు తీశావా లేదా?" ఎదురు చూడని ప్రశ్నకు నిర్ఘాంతపోయి ఒక్క క్షణం వరకు తేరుకోలేకపోయింది.

'అమ్మగోరూ ఏటండి మీరనేది? నానేమీ ఎరగను అన్నది భయంగా, కంగారుగా.

"ఏమీ లేకుంటే ఎందుకు ఆ కంగారు? మర్యాదగా నిజంచెప్పు. లేకపోతే ఆ అయిదు రూపాయలు జీతంలో నుంచి తీసేస్తాను" బెదిరించింది. ఎంతకూ ఒప్పుకోలేదని జీతంలో నుంచి అయిదు రూపాయలు తీసేసి తన మాట నిలుపుకుంది. ఇది జరిగిన కొద్ది రోజులకు ఊడ్చటానికి గదిలోకెళ్ళిన రంగి మాటరాక అచేతనంగా నిలబడిపోయింది. కారణం భర్త పర్సులో నుంచి ఒకనోటు తీసికొని బొడ్లో దోపుకుంటూ లక్ష్మి కనిపించింది.

పెంచల్రెడ్డి ఆ వూరి మోతుబరి. కాసపిసినిగొట్టు. తన పొలాని క్కావలసిన పురుగు

మందులు అగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటర్స్ ఆఫీసులో వున్నంతలో కాస్త చౌగ్గా దొరుకుతాయని పాలేరు చేతికి ఓ "చీటీ" రాసిచ్చి ఆఫీసులోచూపి ఆ మందు పట్ట మన్నాడు. పాలేరు నర్సిమ్మ చద్దికూడు బిర్రుగాలాగి కాలికొద్దీ నడిచాడు. ఆ వూరికి మూడు మైళ్ళ దూరంలోవున్న ఆత్మకూరుకు.

ఆత్మకూరుకు వచ్చి వాళ్ళ "అయ్య" చెప్పినట్టు గుర్తులు పట్టుకొని డిమాన్‌స్ట్రేటరు ఆఫీసుకు చేరుకున్నాడు. టైం కాలేదు కాబోలు-ఆఫీసు యింకా మూసే వుంచారు. ఆ కాంపౌండులో ఓ మూల చతి లబడ్డాడు నర్సిమ్మ ప్రయాణ బడలిక కొద్దీ. ఇంతలో ఎవరో రావడమూ నర్సిమ్మ 'దండాలు' పెట్టడమూ, ఫీసు తెరవడమూ చకచకా జరిగిపోయాయి.

ఆయనెవరో ఓ కుర్చీదులిపి కూర్చుని. "ఆఁ..ఏం కావాలయ్యా" అన్నాడు నర్సిమ్మను జూసి.

నర్సిమ్మ పక్క జేబులో జాగ్రత్తగా దాచుకున్న 'చీటీ' తీసి "ఇది మా అయ్య మీకు సూపి మందిస్తరు. ఎత్తకరమ్మంద్రు" అని తనెవరి తాలూకానో త్వరత్వరగా చెప్పేస్తున్నాడు. ఆ మాటలు ఆ కుర్చీలో ఆయనగారికేం వినిపించడంలేదు. ముఖం కషాయం త్రాగుతున్నట్లు వంకర్లు తిరిగి పోతున్నది. ఆ 'చీటీ'ని అటు త్రిప్పి, యిటు త్రిప్పి చూశాడు. ఆ చీటీలో '7' అంకె మాత్రమే రాసి వుంది. కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. నర్సిమ్మవైపు చూశాడు యిబ్బందిగా. అద్దాలు సర్దుకొని మరలా 'చీటీ'లోకి దూర్చాడు చూపు. నర్సిమ్మమాత్రం అయోమయంగా చూస్తూ వుండిపోయాడు.

'టక్ - టక్' మంటూ బూట్ల శబ్దం వస్తే అటుచూశాడు నర్సిమ్మ. కుర్చీలో కూర్చున్న ఆయన దర్జాగా వచ్చే ఆయన కేసి 'గుడ్‌మార్నింగ్ సార్!' అంటూ కదిలాడు. ప్రతి నమస్కారంచేసి తన కుర్చీ వైపు కదిలాడు దర్జాగావున్న కుర్రాయన.

"అయ్యగారి దగ్గర కెళ్ళు" అని చీటీ యిచ్చి వూపిరి పీల్చుకున్నాడు కుర్చీ ఆయన.

"ఆయన పెద్దాయనగామాలి" అనుకుంటూ సదరు ఆఫీసు దర్జా కుర్రాయనకు 'చీటీ' అందించాడు.

కాలరు సర్దుకుంటూ అందుకున్నాడు. ఆ చీటీ సదరు సహాయ వ్యవసాయ శాఖాధికారి ఆయన భ్రుకుటి ముడిపడింది. మెదడు మొద్దుబారింది. ఊఁహూఁ.... ఐనా తను బయటపడకూడదు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాడు. ఐనా ఏం లాభం! అర్థంకాందే! "నేను ఆఫీసర్ని" అన్నట్టు ఫోజిచ్చి "ఊఁ....ఏమండీ! చలపతిగారూ ఆ మందు యిచ్చి పంపండి" అని క్లర్కుకే పురమాయించాడు.

క్లర్కు నీళ్ళు నమిలాడు. "అదేంటో అర్థం కాలేద్సార్....అలాంటి మందు మన ఆఫీసులోలేదు" చీటీ అందుకుంటూ.

అప్పుడే వచ్చి క్లర్కుప్రక్క నిలబడ్డ వాచరు హజరత్తు ఆ "చీటీ"లోకి చూశాడు ఆసక్తిగా యింత కళవళ పెడుతున్న 'చీటీ' ఏమిటాని.

బుర్రలో తళుక్కున మెరిసింది అదేంటో! చిన్నగా నవ్వి "అది 'సెవన్' సార్" అన్నాడు వాచరు హజరత్తు. ఆ పరమార్థం తెలుసుకుని ఆశ్చర్యంలోంచి తేరుకుని అందరూ నవ్వుకున్నారు తనివి తీరా.

జరిగిందేంటంటే. అసలు మందుపేరు "సెవన్" రైతులనోళ్ళలోపడి క్రమేణా "సెవన్"గా మారిపోయింది. "సెవన్" అంటే యింగ్లీషులో "ఏడు" సంఖ్యకాబట్టి యింగ్లీషు వ్రాయను చేతకాని మోతుబరి పెంచల్రెడ్డి ఆ 'చీటీ'లో '7' అంకె వేసి పంపి తన అతితెలివిని ప్రదర్శించి డిమాన్‌స్ట్రేటరు రమణగారిని, క్లర్కు చలపతిని యిరకాటంలో పడేశాడు.

సంప్రదాయ మాధురి

మంచార మకరందాలు

శ్లో॥ అజ్ఞేభ్యో గ్రంథినః శ్రేష్ఠాః। గ్రంథిభ్యో ధారిణోవరాః।
ధారిభ్యో జ్ఞానినః శ్రేష్ఠాః। జ్ఞానిభ్యో వ్యవసాయినః॥

చదవలేని వాడికంటే చదవగలిగినవాడు మేలు, వాడి కంటే చదివినదాన్ని కంఠతాపట్టిన వాడు మేలు, అంతకంటే అర్థము తెలుసుకున్నవాడు మేలు, వాడి కంటే కూడా ఆచరణలో నిరూపించేవాడు మేలయిన వ్యక్తి!